ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 349 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 27 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల
# నిషేధానికి సిట్



**వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టసవరణకు బిల్లు**
**ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం**
**శాంతిభద్రతలపై కొందరు అడ్డగోలు వ్యాఖ్యలు**
**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన**

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల యాప్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తాము అధికా ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకే తమ ఏడాదికి పైగా పాలనలో ఎలాంటి ఘటనలు లేవని చెప్పారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వీటిని నిరోధించడానికి స్పెషల్ ఇన్వేస్టిగేషన్ టీం సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. మన పరిధిలో విచారణ జరిపిస్తే సమస్యకు సరైన పరిష్కారం దొరకదన్నారు. ఈ కేసులో శిక్షపడేలా ప్రత్యేక చట్టం చేస్తామని కూడా అన్నారు. బెట్టింగ్ యాప్ ల వల్ల ఎంతోమంది బలైపోతున్నారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నేరం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోందన్నారు. గుట్కా నిషేదం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన వాళ్లను విచారిస్తే సరిపోదు.. బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు ఉండాలన్నారు. మమ్మల్ని చంపుతారని కోర్టులో పిటిషన్ వేసినా వామనర్ రావు దంపతుల ప్రాణాలు దక్కలేదన్నారు. వామన్ రావు హత్య ఆరోపణలు ఎదుర్కొన్న వాళ్లను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గంజాయి మత్తులో సింగరేణి కాలనీలో ఆరేళ్ళ చిన్నారిని దారుణంగా హత్య చేశారని చెప్పారు. శాంతి భద్రతలపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సీఎం మండిపడ్డారు. పెట్టుబడుదారులకు రక్షణ కల్పించినప్పుడే పెట్టుబడులొస్తాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం దివాళా తీస్తేనే మంచిదనేటట్లు కొంతమంది వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాము వచ్చిన తర్వాత ఏక్కడైన గొడవలు జరిగాయా? అని రేవంత్ ప్రశ్నించారు. ఈ క్రమంలో జూదాల పట్ల కఠినంగా ఉండాలని అనుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని

..మిగతా 2లో



## రేషన్‌కార్డుదారులకు
# సన్నబియ్యం

**30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**
**త్వరలోనే కార్డుదారులకు మరిన్ని నిత్యావసర సరుకులు**
**మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు**
**తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మించి తీరుతాం**
**అసెంబ్లీలో స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుదారులతో కలసి అందరికీ దీనిని వర్తింప చేస్తామని అన్నారు. త్వరలోనే ఇతర నిత్యావసర వస్తువులను కూడా కార్డుదారులకు అందిస్తామని ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు- ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ

..మిగతా 2లో

## భూభారతిపై
# వాడీవేడి చర్చ



**భూభారతి కాదు..**
**భూహారతి అన్న పల్లా**
**ధరణి పేరుతో బిఆర్ఎస్ దగా చేసింది**
**అందుకే ధరణిని**
**బంగాళాఖాతంలోకి విసిరాం**
**పల్లా వ్యాఖ్యలకు భట్టి ఘాటు సమాధానం**
**వచ్చే ఎన్నికల్లో ధరణితో వెళ్లాలని**
**పొంగులేటి సవాల్**

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భూభారతిపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ పథకాలు అమలు చేస్తున్నారని.. ఇది భూభారతి కాదు భూహారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విపక్ష బిఆర్ఎస్ ఆరోపణలను అధికార పక్షం ఘాటుగా తిప్పికొట్టింది. ధరణి పేరుతో ప్రజల భూములను

..మిగతా 2లో



## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో
# ప్రజాస్వామ్యం ఖూనీ

**ఆనాడు మాకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు**
**రేవంత్ మంచోడు కాబట్టే..మీరు మాట్లాడుతున్నారు**
**అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఘాటు విమర్శలు**

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆనాడు విపక్ష సభ్యులను కనీసం మాట్లాడ డానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. అంతేగాకుండా విపక్షమే లేకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. తెలంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టే బీఆర్ఎస్ నేతలు ఇంకా ప్రశాంతంగా ఫామ్ హౌజ్‌లో ఉన్నారని లేదంటే.. నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒక లెక్క అనేలా పరిస్థితి ఉండేదని

..మిగతా 2లో

## అసెంబ్లీలో వాడీవేడిగా
# మాటల యుద్ధం

**కేటీఆర్ వర్సెస్ భట్టి**
**కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు**
**నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్**



**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ

..మిగతా 2లో

## తెలంగాణలో నిరుద్యోగులకు
# వరం యువ వికాసం

**వందశాతం రాయితీతో**
**రూ. 50 వేల యూనిట్లు**

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం సహాయం చేయడానికి ప్రభుత్వం

..మిగతా 2లో



## వద్దురా నాయనా..
# 20 పర్సంట్ కమీషన్ పాలన

**అసెంబ్లీలో**
**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన**

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం):** అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని డిమాండ్

..మిగతా 2లో





## శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి దాత గుడిబండ నారోత్తమ్ రెడ్డి 2,51,116/-

కొత్తకోట, మార్చి 26(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి కొత్తకోట పట్టణానికి చెందిన ( శ్రీ రాజరాజేశ్వరి వైన్స్ భాగస్వామి ) గుడిబండ విమల నరోత్తమ్ రెడ్డి దంపతులు ఆలయ నిర్మాణం లో భాగంగా గర్భాలయ పిల్లర్ దాతగా రూ' 2,51,116/- ( రెండు లక్షల యాభై ఒక్కవేయ్యి నూట పదహారు రూపాయలు) విరాళాన్ని ప్రకటించారు.గుడిబండ విమల నరోత్తమ్ రెడ్డి దంపతులు అయ్యప్ప సేవాసమితి సభ్యులకు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప సేవాసమితి సభ్యులు ధూపం నాగరాజు, బలిజ లింగేశ్వర్, విశ్వ నాథం గంగాధర్ , వేముల సుధాకర్ రెడ్డి , సత్యం సాగర్ , లక్ష్మీ నారాయణ యాదవ్ , నరేష్ యాదవ్ , వేముల సంతోష్ రెడ్డి, భీమ కిషోర్ లు వారికి ధన్యవాదములు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

## యాసంగి సాగులో నష్టపోయిన రైతులకు ఏకరాకు 50 వేలు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

### మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

భూత్పూర్, మార్చి26(ప్రభాత ఉదయం)యాసంగి సాగులో నష్టపోయిన రైతులకు ఏకరాకు 50 వేలు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం భూత్పూర్ మండల కేంద్రంలో విలేకరులతో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ యాసంగి సీజన్ లో రైతులు అతి కష్టం మీద పంటలు సాగుచేశారు.. ఓ వైపు భూగర్భజలాలు అడుగంటి పోవడం వల్ల పంటలు ఎండి పోతే పశువులకు వధులుతున్న పరిస్థితి నెలకొంది మరో వైపు కింద మీద పడి పంటను కాపాడుకున్న రైతులుకేమో ఇటీవలే కురిసిన వడగండ్ల వానకు రైతులు తీవ్రంగా నష్టపోయారని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ పూర్తి అయ్యిందని తెలపడం సిగ్గుచేటు అన్నారు . రైతు బంధు రాక రుణమాఫీ కాక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు .దేవరకద్ర నియోజకవర్గంలో వెంటనే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వనికి నివేదిక అందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం

మొదటి పేజీ తరువాయి...

అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శాసనసభ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం 8వ ప్రపంచ వింత అని పెయిడ్ ప్రచారం చేయించారని దుయ్యబట్టారు. ఆ ప్రాజెక్టుకు కేసీఆరే ఇంజినీర్ కావడం దౌర్భాగ్యమని అన్నారు. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్షను నిరూపించుకోవాలని పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు.కమిషన్ కె అంటే కాళేశ్వరం, కరెంటు కొనుగోళ్లు, కాకతీయ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చురకలంటించారు. శాసన సభలో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికి లాబీలోకి వెళ్లి నిరసన తెలపడం సరికాదని ధ్వజమెత్తారు. సభ జరుగుతున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని, లాబీల్లో ఫొటోలు తీసిన బిఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్షల్స్‌పై బిఆర్ఎస్ సభ్యులు దౌర్జన్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలతోనే బిఆర్ఎస్‌ను ప్రజలు అక్కడ కూర్చోబెట్టారని, బిఆర్ఎస్ నేత కవిత లిక్కర్ స్కామ్ చేయడంతోనే ఢిల్లీలో ప్రభుత్వం పోయిందని ఎద్దేవా చేశారు. సభలో బిఆర్ఎస్ కావాలని హంగామా చేసిందని, కావాలని లాబీల్లోకి వెళ్లి షో చేశారని దుయ్యబట్టారు.

## అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి...

భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. పార్ట్-బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. విమర్శల జోలికి పోను.. ఆన్‌లైన్ రమ్మీ.. బెట్టింగులపై కఠినంగా ఉంటామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. వచ్చే సమావేశాల్లో ఆ÷-లనైన్ బెట్టింగులుపై చట్ట సవరణ చేస్తామన్నారు. గుట్కా నిషేధిత పదార్థాలు మార్కెట్లో కి వచ్చాయి. వీటిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని పిలిచి విచారిస్తున్నాము. దానితో పరిష్కారం కాదు. బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వారు.. బాధ్యులను కూడా విచారించాలన్నారు. దీనికోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీ-ం వేస్తున్నాం. ప్రకటనలు చేసినా.. నిర్వహణలో భాగస్వామ్యం ఉన్న.. కఠినంగా వ్యవహారం ఉ ంటుందని సభలో సీఎం రేవంత్ ప్రకటించారు. నేరాలు చెప్పి జరగవు. నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటుంది ప్రభుత్వం. న్యాయవాదుల హత్య.. వెటర్నరీ డాక్టర్ హత్యలు గతంలో చూశాం. నడి బజారులో న్యాయవాదులను చంపిన వారిపై సీబీఐ విచారణకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుప్రీం కోర్టుకు చెప్పినట్లు వెల్లడించారు. ఆరేళ్ల అమ్మాయిని సైదాబాద్ లో చంపితే అనాడు సర్కార్ పట్టించుకోలేదు. జూబ్లీహిల్స్ లో మైనర్ బాలిక రేప్ కేసు.. దాంట్లో బీఆర్ఎస్ నాయకుడు ముద్దాయి. మాజీమంత్రి కొడుకుపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనల్లోని బాధితుల పట్ల సానుభూతితో ఉండాలి. కానీ ప్రతిపక్షం.. ప్రభుత్వమే చేయిస్తుంది అన్నట్టు మాట్లాడు తున్నారు అని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇకపోతే ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారని ఘాటుగా స్పందించారు. గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరని అన్నారు. ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంతమాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉ ంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను అని సీఎం పేర్కొన్నారు.మాకు తరతమ భేదాలు లేవని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు.



## భూభారతిపై వాడీవేడి చర్చ

మొదటి పేజీ తరువాయి...

లాక్కున్న దుర్మార్గాలను అడ్డుకున్నామని తెలిపింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. ధరణిపై ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శించారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పించిదన్నారు. కానీ బిఆర్ఎస్ ధరణిపేరుతో సామాన్యుల భూములను కాజేసిందని అన్నారు. వారికి భూమిపై హక్కులు లేకుండా చేసేందుకు ధరణిని తీసుకుని వచ్చారని, ఎందరో భూములు మాయమయ్యాయని అన్నారు. అందుకే ధరణిని బంగాళాఖాతం లో వేస్తామని చెప్పాం.. వేసి చూపామని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చి ప్రజలకు రక్షణ కల్పించామని అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పల్లా వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామని అన్నారు. భూభారతి కాన్సెప్ట్ తో ఈసారి ఎన్నికలకు వెళ్తామని.. ధరణి కాన్సెప్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. వీఆర్‌ఏ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తామని.. వీఆర్‌ఏలు కావాలని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు పొంగులేటి. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారాస ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్‌ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం అని పొంగులేటి చెప్పారు. ధరణి పోర్టల్ పై ప్రజలు తీర్పు ఇచ్చారు.. మా సభ్యులే కాదు.. మీ వైపు ఉన్న సభ్యులు కూడా ఇబ్బంది పడ్డారు.. ధరణిలో ఏర్పడిన సమస్యలతో తమ భూముల సమస్యలు పరిష్కారం కోసం నా దగ్గరికి పలువురు ఎమ్మెల్యేలు వస్తున్నారు వెల్లడించారు. మేము వచ్చే ఎన్నికల్లో భూ భారతి గురించి చెప్పి ఎన్నికలకు పోతాం.. బీఆర్ఎస్ ధరణి పేరుతో ఎన్నికలకు వెళ్తారా? అని ప్రశ్నించారు. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు.. ధరణి తెచ్చి రూల్స్ అసలు ఫ్రేమ్ చేయలేదు.. మేము చట్టం తెచ్చి రూల్స్ సిద్ధం చేస్తున్నాం.. మీరు మాకు చెప్పడం ఎందుకు అని ప్రశ్నించారు. పేదలకు మేము ఇందిరమ్మ ఇండ్ల ఇస్తున్నాం.. వాళ్ళ మాదిరిగా మేము పార్టీల కార్యకర్తలు ఇవ్వం అని తెలిపారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇక, ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ సర్పంచ్.. మీలాగా బీఆర్ఎస్ నాయకులను పెట్టలేదు.. సభను పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారు అని మంత్రి పొంగులేటి తీవ్రంగా మండిపడ్డారు.

## తెలంగాణలో నిరుద్యోగులకు వరం యువ వికాసం




మొదటి పేజీ తరువాయి...

వివిధ చర్యలను అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు మండలాలు, సంక్షేమ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లు మంజూరు చేయనున్నారు. రూ.50 వేల విలువైన యూనిట్లకు 100 శాతం రాయితీ కల్పిస్తారు. ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విధివిధానాలు ఇలా ఉన్నాయి. కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు.. దీనిలో వితంతు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్నవారికి.. స్వయం ఉపాధిలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి.. సంబంధిత పత్రాలను జతచేసి మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలి. ఇటువంటి పథకాల ద్వారా యువతకు ఉ ద్యోగావకాశాలు కల్పించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షల రూపాయల కుటుంబ ఆదాయం, పట్టణాల్లో 2 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వారు ఈ పథకంలో భాగస్వామి కావచ్చు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు కొన్ని ముఖ్యమైన పత్రాలు జతచేయాలి. వాటిలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. ఎంపికైన వారికి 15 రోజుల పాట ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత యూనిట్లను మంజూరు చేసి.. అవసరం అయిన వారికి సహాయం చేస్తారు. ఇక యూనిట్ గ్రౌండ్ చేసిన వారికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు నిపుణుల ఆధ్వర్యంలో సాంకేతిక శిక్షణ ఇస్తారు. వ్యవసాయం కాకుండా ఇతర పథకాలకు దరఖాస్తు చేసిన వారి వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాలకు అయితే 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించారు. తర్వాత ఏప్రిల్ 6 నుంచి 20 వరకు మండలస్థాయి కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు. జూన్ 2 తర్వాత అర్హులకు మంజూరు పత్రాలు జారీ చేస్తారు.



## వద్దురా నాయనా.. 20 పర్సంట్ కమీషన్ పాలన

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ఈ మేరకు సభలో బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం శాసనసభలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సచివాలయంలో కమీషన్లపై, కాంట్రాక్టర్ల ధర్నా గురించి కేటీఆర్ ప్రస్తావించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క స్పందిస్తూ.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. భట్టి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. వద్దురా నాయనా 20 పర్సంట్ పాలన అంటూ.. అసెంబ్లీ ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఇది పర్సంటేజ్‌ల పాలన అంటూ నినాదాలు చేశారు. ఇదేమి ప్రభుత్వం.. 20 శాతం, 30 శాతం పర్సంటేజీల ప్రభుత్వం అని కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

మొదటి పేజీ తరువాయి...

ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 8 వేల హత్యలు.. లక్ష దొంగతనాలు జరిగాయని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అహంకారంతో సాగిందని.. తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన అధికార దుర్వినియోగానికి ఉదాహరణ అని అన్నారు.పోలీస్ అధికారులు కూడా బీఆర్ఎస్ అధికార దాహానికి బలయ్యారని.. బీఆర్ఎస్ పెద్దలు చెప్పిన అందరి ఫోన్లు ట్యాప్ చేసి ఇప్పుడు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ చేయించిన పాపాలతో పోలీసులు విదేశాలకు పారిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకుందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ పీసీసీ పదవిని రూ. 50 కోట్లకు కొన్నడని కోమటి రెడ్డి అన్నాడని కెటిఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డ రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం లేకుండా చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మాకు నీతులు చెప్తున్నారని ఎద్దేవ చేశారు. ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీకు నాయకుడే లేడు.. సభకు రావడమే మానేశారని తెలిపారు. ప్రజల సమస్యలు చెప్పడానికి సభకే రావడం లేదు. రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి మీరు ఇంకా ఫామ్ హౌస్ లో ప్రశాంతంగా ఉన్నారు. లేకుంటే నిన్నటి నుంచి ఒకలెక్కా.. ఇవాల్టి నుంచి ఇంకో లెక్క అన్నట్టు ఉండేది.సైరన్ సప్పుడు లెకుండా తిరుగుతున్నారు కాబట్టి వాళ్ళు అంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ లీడర్లు అందరి ఫోన్లు ట్యాప్ చేసి అధికార దాహానికి బలై పోయారు. అహంకారంతో సాగింది బీఆర్ఎస్ పాలన.. మేము ఆరుగురం ఉన్నప్పుడు మా గొంతు నొక్కారు. సభ మీ సొంతమా అని అడిగారు. ఇప్పుడు నేను అడుగుతున్న.. సభ మీ సొంతమా మరి.. వచ్చినప్పటి నుండి ఒకటే గొడవ.. మీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.. ఆ టైమ్ ప్రజల కోసం కేటాయిస్తే చాలు అని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

# పంటలు ఎండిపోతున్న పట్టించుకోరా?

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి26(ప్రభాత ఉదయం)రాష్ట్రంలో పంటలు ఎండిపోతూ.. రైతులు ఆందోళన చెందుతున్నా.. నీళ్లిచ్చి ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డ చందంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపి. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ 104 ప్యాకేజి కాలువ ఆయకట్టు సాగునీరందక పంటలు ఎండిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు ఆధ్వర్యంలో బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో గల కొండాపురం, వెంకటాపురం, ఉమిత్యాల గ్రామాలలో ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ బిఎంసంతోష్, ఇరిగేషన్ ఎస్ఇ రహీముద్దీన్ లకు ఫోన్‌చేసి పంటలు ఎండిపోకుండా సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోచుకోవడం.. దాచుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకున్నదని, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడింది శూన్యమని తెలిపారు. జూరాల, నెట్టెంపాడు రిజర్వాయర్ ఆయకట్టు కింద సాగునీరందకపోవడంతో యాసంగి పంటలు ఎండుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని ఆయన విమర్శించారు. యాసంగి సాగుకు ముందు ప్రభుత్వం ఐఎబీ సమావేశం నిర్వహించకుండా యాసంగి పంటల ప్రణాళిక


ఎండిన పంటను చూపిస్తున్న మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

రూపొందించిందని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి రైతుల పొలాలకు నీరు ఇచ్చి పంటలను కాపాడలేక పోయారని వాపోయారు. ముఖ్యమంత్రి తన సీటును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటే.... నీటి పారుదల శాఖ మంత్రి ఆ సీటు పై కన్నేశాడని ఆరోపించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, అయినా సీఎం రేవంత్ రెడ్డి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఓవైపు పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే వారిని పరామర్శించడానికి కూడా రాష్ట్ర మంత్రులు, స్థానిక నాయకులకు తీరిక లేదని విమర్శించారు. పదేళ్లలో ఎప్పుడు కూడా రైతుల పంటలు ఎండకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంటలు ఎండడానికి కారణమయ్యాడని ఆరోపించారు.ప్రస్తుతం రైతులకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని మాజీ మంత్రి ప్రశ్నించారు. వరంగల్ డిక్లేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసాను మూడు ఎకరాలతోనే బందు చేసిందని అన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒట్లు వేసి అటు దేవుళ్లను, ఇటు రైతులను నిండా మోసం చేశాడని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల నీటిని నిలువ చేసుకోలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ యాసంగిలో రైతులు ప్రభుత్వం, అధికారుల మాటలు విని పంటలు సాగు చేస్తే.. ఆ పంటలకు ప్రస్తుతం నీరులేక ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఆర్డీఎస్ పరిధిలో గత 50 ఏళ్ల కాలంలో ఏనాడు కూడా ఇలాంటి పరిస్థితి కనిపించ లేదని మాజీ మంత్రి అన్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ కింద 47,000 ఎకరాలలో రైతులు వివిధ పంటలు సాగుచేశారని, ప్రస్తుతం పది రోజులుగా నీరు నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతుల పంటలు కాపాడాలని మాజీ మంత్రి కోరారు. మాజీ మంత్రి వెంటా బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, నాగర్ దొడ్డి వెంకట్రాములు, పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, మోనేష్, కురువ పల్లయ్య, పటేల్ జనార్ధన్‌రెడ్డి, అంగడిబస్వరాజు, ఎస్.రాము, నక్కరవి, గాజుక కృష్ణ, తిరుమలేష్, వెంకటేష్ నాయుడు, కామేష్, అనిల్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర

## పాడి పశువుల పెంపకం గురించి రైతులకు మెళకువలు అందజేస్తాం

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం) : పాడి పశువుల పెంపకంలో క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటిని అదిగమించడానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రూపొందించిన ఆవిష్కరణలపై బుదవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల లో జరిగిన ఒక రోజు సదస్సులో చర్చించారు. వాటిని రైతులకు ఏ విదంగా చేరవేయాలనే అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఇంటర్నెట్ ను ఉపయోగించి రైతులకు సూచనలు, సలహాలు అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, డీన్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఉదయకుమార్ పరిశోధన సుచాలకులు డాక్టర్ సీహెచ్ హరిక్రిష్ణ, విస్తరణ సం చాలకులు డాక్టర్ కిషన్ కుమార్, రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి, కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న పుష్ప లీల

## ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి: పుష్పలీల

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం): వర్షం నీరు భూమిలో ఇంకేటట్లు ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పుష్పగిరి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వాహకురాలు పుష్పలీల అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొన్న పుష్పలీల విద్యార్థులకు నీటి పొదుపు పై అవగాహన కల్పించారు. ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షం నీరు వృధాగా పోకుండ భూమిలో ఇంకించినప్పుడు భావి తరాలకు మేలు చేసినవారమౌతామన్నారు. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కె.శ్రీలత మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న నాటి నుంచే పర్యావరణం, నీటి సంరక్షణ, నీటి పొదుపు ల గురించి అవగాహన కలిగి ఉండటం మంచిదన్నారు. ఇది జాతి ప్రజలకు, దేశ అభివృద్ధికి అవసరం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగారెడ్డి, రోజా రాణి, పద్మావతి. సురేశ్, కమలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




## మతసామరస్యం కోసం ఇఫ్తార్ విందులు

### ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్.. గడ్డం శేఖర్ యాదవ్

శంషాబాద్, మర్చి 26( ప్రభాత ఉదయం) ఇఫ్తార్ విందులు మత సామారస్యా నికి ప్రతీక అని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ నర్కుడ లొ బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కు అయన ముఖ్య అతీథిగా హ జరయ్యారు. హిందూ ముస్లింలు అనాదిగా సోదర భావంతో జీవిస్తున్నారని ఆ పరంపరను అలాగే కొనసాగించాలని కోరారు. వరుసగా 13వ ఏట ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన శేఖర్ యాదవ్ను ఆయన అభినందించారు. యువకుడు శేఖర్ యాదవ్ కు రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉండాలని ఆశిస్తున్నట్లు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్. మాజీ కౌన్సిలర్ బండి శ్రీకాంత్ యాదవ్. బంగారం కుమార్. తొంట అశోక్. గడ్డం మల్లేష్ యాదవ్. మైనార్టీ నాయకులు గౌస్ అలీ బేగ్. నసిరుద్దీన్. తాజ్ బాబా. ముఖీద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో ఆనంద్ కరాజ్ చట్టాన్ని అమలు చేయలి

### అధ్యక్షుడు ఎస్.హర్పాల్ సింగ్ రంజన్

రాజేంద్రనగర్, మార్చి 26(ప్రభాత ఉదయం)డబ్ల్యూ పి 7193/2025-రెగ్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను విడదీయడం.డబ్ల్యూపి 7193/2025 ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఆనంద్ కరాజ్ చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ హైకోర్టు ఒక ఉత్తర్వులు జారీ చేసిందని అధ్యక్షుడు ఎస్.హర్పాల్ సింగ్ రంజన్ తెలిపారు.బుధవారం భారతదేశంలో,ఆనంద్ కరాజ్ (సిక్కు వివాహ) చట్టం సిక్కు సమాజానికి ముఖ్యమైన ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు.ఇది సిక్కు వివాహాలకు సంబంధించిన వివాహ వేడుకలు,చట్టపరమైన అంశాలను ప్రత్యేకంగా నియంత్రించే చట్టం కిందకు వస్తుందన్నారు. వివాహాలకు చట్టపరమైన గుర్తింపు,రక్షణ కల్పించడానికి ఈ చట్టం స్థాపించబడిందన్నారు.సిక్కు జంటలు తమ మతపరమైన ఆచారాలు,సంప్రదాయాల ప్రకారం వివాహాలు చట్టబద్ధంగా చెల్లుబాటు అయ్యేలా చూసుకోవడానికి వీలు కల్పిస్తుందని అయనతెలిపారు.2012లో,పార్లమెంటులో ఆనంద్ కరాజ్ (సవరణ) బిల్లును ఆమోదించింది.సిక్కు సంప్రదాయ వివాహాలను చట్టపరమైన గుర్తింపు పరిధిలోకి తీసుకువస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వం సవరణలను ఆమోదించగా,ఆనంద్ కరాజ్ రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత నిబంధనలను రూపొందించడానికి వ్యక్తిగత రాష్ట్రాలు, యుటిలకు వదిలివేయబడిందన్నారు.7 జూన్ 2012న ఆనంద్ వివాహ సవరణ చట్టం 2012కి భారత రాష్ట్రపతి ఆమోదం లభించిందన్నారు.ఈ చట్టం సిక్కు సంప్రదాయ వివాహాల ధృవీకరణకు మార్గం సుగమం చేసిందన్నారు. ఆనంద్ కరాజ్ (వివాహం) చట్టం 1909ని సవరించింది. తద్వారా "ఆనంద్ కరాజ్" వివాహాల నమోదు తప్పనిసరి సవరణ బిల్లు ప్రకారం,ఈ చట్టం కింద వివాహాలు నమోదు చేసుకున్న జంటలు తమ వివాహాన్ని జనన,వివాహాలు, మరణాల నమోదు చట్టం,1969 లేదా ప్రస్తుతానికి అమలులో ఉన్న మరే ఇతర చట్టం కింద నమోదు చేసుకోవ లసిన అవసరం లేదు అని ఆయన సూచించారు. జమ్మూ,కాశ్మీర్, పంజాబ్,హర్యానా,ఢిల్లీ,చండీగఢ్,హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా,అస్సాం,జారండ్,ఉత్తరాఖండ్, మేఘాలయ వంటి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే తమ తమ రాష్ట్రాల్లో ఆనంద్ కరాజ్ చట్టాన్ని అమలు చేశాయని తెలిపారు.ఈ చట్టాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని మేము అనేక సార్లు తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.అయితే అది ఇంకా అమలు కాలేదు.అందుకే మన రాష్ట్రంలో ఆనంద్ కరాజ్ చట్టాన్ని అమలు చేయాలని మా న్యాయవాది సర్దార్ జస్బీర్ సింగ్ ద్వారా హైకోర్టును ఆశ్రయించాడం జరిగిందన్నారు. చట్టం ప్రకారం,వీలైనంత త్వరగా,ఆర్డర్ ఇచ్చిన తేదీ నుండి నాలుగు వారాల వ్యవధిలో,దరఖాస్తుపై అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం సంతోషించు దగ్గర విషయమని అధ్యక్షుడు ఎస్.హర్పాల్ సింగ్ రంజన్ తెలిపారు.

## వేలంపాటలో మంచి ధర పలికిన సీజ్ చేసిన వాహనాలు

రాజేంద్రనగర్, మార్చి 26(ప్రభాత ఉదయం) శంషాబాద్ ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన వాహనాల వేలంపాట మంచి ధర పలికింది. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి లో గల ఎక్సైజ్ కార్యాలయంలో 8 వాహనాలకు 27 వేల ఎనిమిది వందల రూపాయలు ధర నిర్ధారించి వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో ఆసక్తిగల వ్యక్తులు పాల్గొని 53 వేల ఎనిమిది వందల రూపాయలకు వేలం పాటలో వాహనాలను దక్కించుకున్నారు. ఎక్సైజ్ అధికారులు నిర్ధారించిన ధర కంటే 93% అధికంగా ధర పలికిందని అధికారులు తెలిపారు.

## హైకోర్టు తీర్పు ప్రకారం సిక్కుల వివాహ చట్టాన్ని అమలు చేయాలి

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో సిక్కు వివాహ చట్టం (ఆనంద్ కరాజ్) ను అమలు చేయాలని రాజేంద్రనగర్ లోని సిక్కుల నాయకుడు ఎస్. హర్పాల్సింగ్ రం జన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని తెలంగాణ హై కోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సిక్కు వివాహ చట్టం సిక్కులకు ఎంతో ఉపయోగకరమైన చట్టం అన్నారు. సిక్కులు చేసుకునే వివాహాలకు చట్టపరంగా హక్కులు కలిగే ఈ బిల్లును హై కోర్టు ఆమోదిం చన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును అమలు చేసి సిక్కులకు న్యాయం చేయాలన్నారు. ఈ అంశాన్ని కోరులో వాదించిన సర్దార్ జస్బీర్ సింగ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట

### యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి 26(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. నిరుద్యోగ యువతి, యువకులు ృఈ పృథకానికి దరఖాస్తు చేసుకోని స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను మెనిఫెస్టోలో పెట్టిన వాటిని దశల వారిగా అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందులో భాగంగా రాజీవ్ యువ వికాసం రాజీవ్ ఆపన్న హస్తం పేరుతో ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రారంభించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కోసం 1%-%4 లక్షల వరకు రుణాలు అందించనున్నారని పేర్కొన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి తెలంగాణ రాష్ట్రంలో ఆరు వేల కోట్లతో ఐదు లక్షల మంది యువతకు రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం ధరఖాస్తు చేసుకునే వారు ధరఖాస్తుకు వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందనికి ప్రభుత్వం ద్వారా ఇస్తున్న స్వయం ఉపాధి కింద పొందే వారందరికి 60%-%80 శాతం వరకు రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు. ఇందుకు ధరఖాస్తును ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభవృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు శ్రీరామరక్షగా ఉన్నాయని తెలిపారు.


సీఎం రేవంత్ రెడ్డితో నాగేందర్ రెడ్డి

## బిల్లు మంజూరు చేయాలంటే కమీషన్ ఇవ్వాల్సిందేనట

### చెన్నూరు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఆవేదన

చెన్నూర్, మార్చి 26. (ప్రభాత ఉదయం): అమ్మా ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చెన్నూరు కస్తూరిభా పాఠశాలలో నిర్వహించిన పలు పనులకు సంబదించిన బిల్లులు మంజూరు చేయకుండా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అంగ అరుణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మా ఆదర్శ పాఠశాలలో భాగంగా దాదాపు 4లక్షల 51వేల రూపాయల పనులు మంజూరు కాగా, అప్పు చేసి మరీ అట్టి పూర్తి పనులు చేయించామని, అందులో కొంత బిల్లు ఇప్పటికే వచ్చాయని మరో 55వేల రూపాయలు రావాల్సి ఉండగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత బిల్లు మంజూరు చేయాలంటే తనకు కూడా కొంత వాటా ఇవ్వాలంటూ బిల్లు మంజూరు చేయడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అట్టి విషయమై జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా డీఈవో కు పిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా తన ఆవేదనను అర్థం చేసుకొని ఉన్నతాధికారులు తనకు రావాల్సిన బిల్లు మంజూరు చేయాలని అరుణ కోరుతున్నారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్


తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ బుధవారం తిరుమల తిరుపతి దేవ స్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట నాయకులు చెరుకు అమరేందర్, చెరుకు మాధవిలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలను తిరుమల లో అనుమతిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.



# బెట్టింగ్ యాప్‌లపై గట్టు పోలీసుల అవగాహన

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి26(ప్రభాత ఉదయం)యువత ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతూ డబ్బులు పోగొట్టుకుంటున్నారని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వెళ్లొద్దంటూ గట్టు ఎస్ఐ కేటి మల్లేష్ సూచించారు. బుధవారం గట్టు మండల కేంద్రంలో గట్టు ఎస్ఐ కెటి మల్లేష్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ మరియు బెట్టింగ్ యాప్ ల పై ప్రజలకు అవగాహన కార్యక్రమాని నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి ఓటీపీలు షేర్ చేయరాదు అని, నీలిరంగు లింకులను క్లిక్ చేయరాదని సూచించారు.ప్రస్తుతం ఐపియల్ సమయంలో విపరీతంగా ఒకరి చేతుల నుండి మరొకరి చేతిలోకి, ఒకరి ఫోన్ నుండి ఇంకొకరి ఫోన్ లోకి విపరీతంగా డబ్బులు మారుతుంటాయని, ఎవరో ఒక్కరూ మాత్రమే బెట్టింగ్ యాప్ ల ద్వారా డబ్బులు గెలుచుకున్నారని వెర్రితనంగా మీరు ఆవలలో చిక్కుకోవద్దని అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్స్ యాప్ లో యువత బెట్టింగ్ ఆడి ప్రాణాలు పోగొట్టుకోవడం మన కళ్ళముందే జరగడం రోజు చూస్తూనే ఉన్నామని, అటువంటి సంఘటనలు మన మండల పరిధిలో జరగకుండా చూడవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. ముఖ్యంగా యువత తల్లితండ్రులు అవసరానినికి మించి పిల్లలకు డబ్బులు ఇవ్వకూడదన్నారు. ఈ బెట్టింగ్ మహమ్మారి వలలో చిక్కుకొని ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి కాబట్టి మండలంలోని యువత ఈ బెట్టింగ్ యాప్ లకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా మిమ్మల్ని బెట్టింగ్ యాప్ లో బెట్టింగ్ చేయమని ప్రోత్సహించిన మీతో బలవంతం చేసి బెట్టింగ్ యాప్లలో బెట్టింగ్ చేయించిన అలాగే ఎవరైనా సైబర్ క్రైమ్ కు గురి అయిన వెంటనే గట్టు పోలీసులకు తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అయ్యన్న, కానిస్టేబుల్ భీమేష్, ఉమెన్ కానిస్టేబుల్ హసీనా మరియు పోలీస్ సిబ్బంది, ఆరగిద్ద, ఎల్లం దొడ్డి, బోయలగూడెం, మాచర్ల, మిట్టదొడ్డి, గట్టుకు చెందిన గ్రామస్తులు పాల్గొన్నారు.




# వైద్య వృత్తి అన్ని వృత్తుల కన్నా ఉన్నతమైనది

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి26(ప్రభాత ఉదయం)బుధవారం జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ వైద్య కళాశాల లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులను ఉద్దేశించి వైద్య వృత్తి అన్ని వృత్తుల కన్నా ఉన్నతమైన వృత్తి అని తెలియజేశారు. వైద్య విద్యార్థులు చెడు అలవాట్లకు, డ్రగ్స్ కు బానిస కాకుండా క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలియజేశారు. వైద్య విద్యార్థులు తమ లక్ష్యం సాధించుకునే దిశగా కష్టపడి చదవాలన్నారు. వైద్య విద్యార్థులు ఓర్పు, సహనం అలవర్చుకొని పేషంట్ల యెడల ప్రేమతో నడుచుకోవాలని, మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. వైద్య విద్యార్థులు సేవా దృక్పథం కల్గి జీవించాలని, కష్టపడి చదివి, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు.

# రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు

గద్వాలటౌన్, మార్చి 26 (ప్రభాత ఉదయం)ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ లో యువతకు పెద్ద పీఠ వేస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒకరికి కాంగ్రెస్ లో గుర్తింపు ఉంటుందనడానికి మీనాక్షి నటరాజన్ నియామకం ఉదాహరణగా ఆయన అభివర్ణించారు.



## గ్రామ స్వరాజ్యం రాజ్యాంగ పరిరక్షణ కొరకు

# ప్రతి ఒక్కరు కృషి చేయాలి






**జై బాపు జై భీమ్ జై సంవిధాన్ సదస్సులో ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి సరితమ్మ తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మెన్ వెన్నెల (గద్దర్) రాష్ట్ర జోగులాంబ గద్వాల జిల్లా సమన్వయకర్త క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి26(ప్రభాత ఉదయం)ఏఐసీసీ పిలుపు మేరకు అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండల కేంద్రంలో బీచుపల్లి సాగర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన జై బాపు ...జై భీమ్ జై... సంవిధాన్... జిల్లా స్థాయి సదస్సు లో ముఖ్య అతిథిగా పాల్గొన్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్,జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత, తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మెన్ వెన్నెల (గద్దర్ ), రాష్ట్ర జోగులాంబ గద్వాల జిల్లా సమన్వయకర్త క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ హాజరయ్యారు.అనంతరం వారు మాట్లాడుతూ... గాంధీజీ , డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రాజ్యాంగ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.మహాత్మ గాంధి చూపిన మార్గంలో నడుస్తూ అంబేద్కర్ గారి రాజ్యాంగాన్ని కాపాడుతూ దేశ ప్రజలను మభ్య పెడుతూ మనువాద సిద్ధాంతాన్ని ప్రజల పైన రుద్దుతున్న భారతీయ జనతా పార్టీని ఎండగడుతూ రాజ్యాంగ పరిరక్షణ పైన అవగాహన కల్పించే దిశగా గ్రామ గ్రామాన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు..బీజేపీ ప్రభుత్వం హిందీని జాతీయ భాష చేయాలని కుట్ర పన్నుతున్నారు తెలుగు ప్రాంత ప్రజలకు అన్యాయం చేసే ఈ చర్యను అడుగడుగునా అడ్డుకోవాలని అన్నారు.రాజ్యాంగం యిచ్చిన హక్కుల ద్వారానే మనం ప్రశ్నించ గలుగుతున్నాం మన హక్కులను సాధించ గలుగుతున్నం కనుక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు పైన ఉందని సూచించారు...ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్ మరియు గద్వాల జిల్లా లోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## చలివేంద్రం ఏర్పాటు బాటసారుల


# దహార్తికి ఎంతో దోహదం

## తహసీల్దార్ మల్లికార్జున్

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి26(ప్రభాత ఉదయం) చలివేంద్రాలతో బాటసారుల దాహార్తి తీరుతుందని గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్ అన్నారు. గద్వాల మండల పరిధిలోని బస్రాచెరువు గ్రామ పంచాయితీ యశోద ఆధ్వర్యంలో అనంతపురం స్టేజ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం గద్వాల మండల తహశీల్దార్ తో పాటు ఎంపీఓ చంద్రకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ఎండలు అత్యధికంగా ఉండటంతో ప్రజలకు చల్లని నీటిని అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని చెప్పారు. ప్రజలు ఎండలో తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండాకాలం పూర్తయ్యే వరకు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో నిరంతరం ప్రయాణికులకు చల్లని మంచినీళ్లు అందుబాటులో ఉంచుతామని, ప్రయాణికులు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, చలివేంద్రం చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ యశోద, పూడూరు మరియు అనంతపూర్ గ్రామ ఇంచార్జీ సెక్రటరీ శేఖర్, నరసింహారెడ్డి , గ్రామస్తులు బ్రహ్మేశ్వర రెడ్డి, బ్రహ్మరెడ్డి, కర్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

# అభ్యుదయ కవిత్వ లక్ష్యం మెరుగైన సమాజం

## మాజీ ఉపకులపతి డాక్టర్ ఎస్‌వీ సత్యనారాయణ





గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి26(ప్రధాత ఉదయం) అభ్యుదయ కవిత్వ లక్ష్యం మెరుగైన సమాజం, మెరుగైన దేశం, మెరుగైన జీవితం అని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. గద్వాలలోని ఎంఏఎల్ డి, కళాశాలలో బుధవారం కళాశాల తెలుగు విభాగము, పీజీ సెంటర్, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదికల సంయుక్త ఆధ్వర్యంలో "అభ్యుదయ కవిత" అనే అంశంపై విస్తృతోపన్యాసము ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఆచార్య చెన్నకేశవరెడ్డి వ్యవహరించగా, సభాప్రారంభకులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణ మాట్లాడుతూ...అభ్యుదయ కవిత్వం గురించి వివరిస్తూ సామాజిక ఛాందసత్వంపై కందుకూరి వీరేశలింగం పంతులు, భాషాఛాందసంపై గిడుగు రామమూర్తి పంతులు, సాహిత్య ఛాందసంపై గురజాడ అప్పారావు లాంటి వారు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. గరిమెల్ల సత్య నారాయణ, శ్రీశ్రీ, మొదలగు కవుల రచనలు – అందులోని కవిత్వం చెప్పడమే గాక కట్టమంచి రామలింగారెడ్డి వారి ముసలమ్మ మరణం " మొదలగు విషయాలను తెలిపి నేటి కవులు రాస్తున్న కవిత్వం వరకు తెలియజేశారు. ప్రాచీన కవిత్వం నుండి భావకవిత్వం, భావకవిత్వం నుండి అభ్యుదయ కవిత్వం వరకు 'కవిత్వము–వాటి మధ్య తేడాలను వారి వారి రచనలతో విద్యార్థులకు తెలియ జేశారు. ప్రసంగ ఆద్యంతం తనదైన శైలితో నాటకీయ ధోరణిలో చెప్పి విద్యార్థులను ఆకట్టుకొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా గద్వాల పీజీ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి, కళాశాల తెలుగు విభాగాధిపతి ఎంహెచ్. నాగభూషణం, గద్వాల పీజీ సెంటర్ సహాయ ఆచార్యులు డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు సంధానకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఎల్ డి కళాశాల తెలుగు అధ్యాపకులు శ్రీవెంకటేశ్వర్లు, సపారే శంకర్, రాములు, కవులు డాక్టర్ అంబటి భానుప్రకాష్ . ఇగ్బాల్ భాషా, అధ్యాపకులు శ్రీ కృష్ణయ్య, శ్రీ రఫీక్, జి.రాముడు తదితర అధ్యాపకలు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# వర్షాలకు పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు 30,000 ఇవ్వాలి

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి. జబ్బార్

కొత్తకోట, మార్చి 26(ప్రభాత ఉదయం) గత ఐదు రోజుల కిందట కురిసిన భారీ వడగండ్ల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం కానాయిపల్లి గ్రామంలో నష్టపోయిన రైతులను పరామర్శించి రైతు పంట పొలాలను ఈ సందర్భంగా పరిశీలించారు. కొత్తకోట మండలంలోని ,కానాయిపల్లి, సంకిరెడ్డిపల్లి,రాయణి పేట,వనపర్తి మండలంలోని క్రిష్ణగిరి నాశనల్లి, మణిగిల్ల, గ్రామంలో మొత్తం 8,00ఎకరాలు వరి పంట నష్టం జరిగిందని ప్రభుత్వము పంట నష్ట వివరాలను సేకరించి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. 80 శాతం వడగండ్ల వర్షాలకు భారీగా నష్టపోవడం జరిగిందని కానయపల్లి గ్రామంలో 183 ,ఎకరాలు నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వము పంట రైతు బీమా ఇన్సూరెన్స్ కల్పించాలని వాటి ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ప్రభుత్వము రైతు రుణమాఫీ, రైతు భరోసా,ఇంకా 60 శాతం కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి వెంటనే రైతు పంట పొలాల దగ్గరికి వెళ్లి పరిశీలన చేసి రైతులను ఆదుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు బక్క శ్రీను, కురుమన్న, వెంకటయ్య, మాసన్న, నరసింహారెడ్డి,గోపాల్ రెడ్డి, చిన్న నరసింహులు,దామోదర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, వెంకటయ్య, కురుమన్న,రాములు,తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608